డబ్బు, మద్యం జానాన్తైనై

మంచి వ్యక్తినే సర్పంచ్‌గా ఎన్నుకోవాలి
విద్యావంతుడై గ్రామంలోనే ఉండాలి
సమగ్రాభివృద్ధికి పాటుపడాలి
ఇదీ సర్పంచ్ ఎన్నికపై ప్రజల అభిప్రాయం

7

236 నామినేషన్ల తిరస్కరణ



168 సర్పంచ్, 68 వార్డు అభ్యర్థుల నామినేషన్లకు నో

19 వార్డులకు దాఖలు కాని నామినేషన్లు.. 1,216 సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లకు ఓకే

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో తొలి విడత జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు వచ్చిన నామినేషన్లలో 236 నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు తిరస్కరించారు. తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలు జరిగే 262 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 1,384 నామినేషన్లు రాగా, పరిశీలనలో 168 నామినేషన్లను తిరస్కరించారు. 1,216 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ప్రకటించారు.

68 మంది వార్డు అభ్యర్థుల నామినేషన్లు రిజెక్ట్

తొలి విడతలో 2,198 వార్డులకు జరిగే ఎన్నికల్లో మొత్తం 4,379 నామినేషన్లు రాగా, పరిశీలనలో 68 నామినేషన్లు తిరస్కరించారు. 4,311 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. తాండూరు మండలంలో 290 వార్డుల్లో 569 నామినేషన్లు, బషీరాబాద్‌లో 311 వార్డుల్లో 607 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించారు. యాలాల్‌లో 318 వార్డుల్లో 600 నామినేషన్లు, పెద్దేముల్‌లో 308 వార్డుల్లో 655 నామినేషన్లు, కొడంగల్‌లో 218 వార్డుల్లో 448 నామినేషన్లు సక్రమంగా ఉన్నాయి. దౌల్తాబాద్‌లో 290 వార్డుల్లో 569 నామినేషన్లు, బొంరాస్‌పేట్‌లో 278 వార్డుల్లో 523 నామినేషన్లు, దుద్యాల్‌లో 166 వార్డుల్లో 340 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ప్రకటించారు. కాగా, బొంరాస్‌పేట మండలంలో 14 వార్డులు, కొడంగల్ మండలంలో 4 వార్డులు, బషీరాబాద్ మండలంలో ఒక వార్డుకు నామినేషన్లు దాఖలు కాలేవు. ఫలితంగా తొలి విడతలో 19 వార్డులకు ఎన్నికలు జరగడం లేదు.

మండలాల వారీగా సర్పంచ్‌ల నామినేషన్ల తిరస్కరణ వివరాలు

మండలం	పంచాయతీలు	నామినేషన్లు	తిరస్కరణ	అంగీకారం
తాండూరు	33	166	17	149
బషీరాబాద్	39	208	13	195
యాలాల్	39	195	35	160
పెద్దేముల్	38	221	29	192
కొడంగల్	25	152	29	123
దౌల్తాబాద్	33	173	25	148
బొంరాస్‌పేట్	35	152	9	143
దుద్యాల	20	117	11	106

రాంపూర్‌మీది తండా ఏకగ్రీవం

తాండూరు రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తాండూరు మండల పరిధిలోని రాంపూర్‌మీది తండా పంచాయతీ సర్పంచ్ పదవికి తొలుత ఐదు మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాగా, సోమవరం క్లస్టర్ కేంద్రంలో సర్పంచ్‌కు సంబందించి వి.రాంచందర్, వి.లక్ష్మణ్, పట్లోళ్ల సావిత్రమ్మ, నేనావత్ మోహన్ నాయక్ తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకున్నారు. దీంతో చేసుకోవడంతో పట్లోళ్ల వెంకట్‌రెడ్డి ఒకే నామినేషన్ ఒకటే ఉండటం వల్ల ఏకగ్రీమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోపక్క వార్డు సభ్యులంతా ఒకే నామినేషన్ వేయడం వల్ల వారంతా ఏకగ్రీవమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. అదే విధంగా సిరిగిరిపేట్ సర్పంచ్ స్థానానికి పి. వెంకటప్ప నామినేషన్‌ను విత్ డ్రా చేసుకున్నారు.

తొలి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన పర్వం ముగిసింది. ఎన్నికల బరిలో ఎవరు నిలుస్తారనేది నామినేషన్ల ఉపసంహరణ తర్వాతనే స్పష్టత రానుంది. ఒకే పార్టీకి చెందిన ఇద్దరు, ముగ్గురు మద్దతుదారులు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో విజయావకాశాలు తగ్గిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో బుజ్జగింపుల పర్వం ఊపందుకుంది. ఇందుకు రహస్య సమావేశాలు నిర్వహిస్తూ అవసరమైన హామీలను ఇస్తూ విత్‌డ్రా చేసుకునేలా పెద్ద మనుషులు, కులపెద్దలతో చెప్పిస్తున్నారు. అలాగే పలుచోట్ల భారీగా డబ్బులు ముట్టజెప్పి పోటీ నుంచి తప్పించే ప్రయత్నాలు సైతం జరుగుతున్నాయి.



బుంగమూతులు..

బుజ్జగింపులు!

నామినేషన్లు ఉపసంహరించుకునేలా ప్రయత్నాలు

పెద్దమనుషులు,
కులపెద్దలతో రాయ‘బేరాలు’
భారీగా ముట్టజెప్పేందుకు
సిద్ధంగా అభ్యర్థులు
ససేమిరా అంటున్న ప్రత్యర్థులు..
తలపట్టుకుంటున్న నేతలు
ప్రధాన పార్టీల మద్దతు
కోసం అభ్యర్థుల అగచాట్లు
ఉపసంహరణకు రేపు
మధ్యాహ్నం వరకే గడువు



వికారాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సర్పంచ్ పదవులకు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు కావడంతో తమ ప్రత్యర్థులను బరిలో నుంచి తప్పించేందుకు అభ్యర్థులు ఎవరి ప్రయత్నాల్లో వారు మునిగితేలారు. ఉపసంహరణకు రేపు(3వ తేదీ) మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే అవకాశం ఉంది. దీంతో సామ, భేద, దాన, దండోపాయాలను వినియోగిస్తూ ప్రత్యర్థులను బరిలో నుంచి తప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో ఒక్కో ఓటు ఎంతో కీలకం కానున్న క్రమంలో తమ ప్రత్యర్థులను ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలతో బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. అయినా నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ఉప సంహరించుకునేందుకు ఎవరూ వెనక్కితగ్గడం లేదు. ఎంత ఖర్చయినా పోటీలో ఉండటమే లక్ష్యంగా ఉన్నారు. అయితే ఒక ఓటు అభ్యర్థుల విజయావకాశాలు తారుమారు చేసే అవకాశం ఉండడంతో మద్దతుదారుల ఓట్లు చీలిపోకుండా తమ నామినేషన్లను ఉప సంహరించుకునేలా పావులు కదుపుతున్నారు. తమ పార్టీకి చెందిన వారిని పోటీ నుంచి తప్పించేందుకు గ్రామ పెద్ద మనుషులతో పాటు కుల పెద్దల మద్దతు కూడా తీసుకుంటున్నారు. అంగబలం, అర్థబలం ఉన్న అభ్యర్థులు తమ పార్టీ ముఖ్య నేతలతో నచ్చజెప్పడమే కాకుండా భారీగా డబ్బులు ముట్టజెప్పి పోటీ నుంచి తప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పార్టీ పరంగా ఏదో ఒక హామీ ఇప్పించైనా పోటీ నుంచి తప్పించాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

‘పంచాయతీ’ రసవత్తరం

పంచాయతీ ఎన్నికలతో గ్రామాల్లో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. సర్పంచ్, వార్డు పదవులకు ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. నామినేషన్ల ఉప సంహరణ పర్వం ముగియక ముందే, గుర్తులు కేటాయింపు జరగకున్నా ప్రచారం మొదలు పెట్టారు. ఓటర్లను కలుస్తూ తమదైన శైలిలో

మిగతా 8వ పేజీలో...



రిజిస్టర్లను పరిశీలిస్తున్న స్వర్ణ కుమారి

పీహెచ్‌సీల్లో మందుల నిల్వలపై ఆరా

ధారూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ధారూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి స్వర్ణ కుమారి సోమవారం సందర్శించారు. ఆసుపత్రిలో రిజిస్టర్లను పరిశీలించి, మందుల నిల్వలు, అవసరమైన మందుల గురించి వైద్య సిబ్బందిని ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి, వైద్య సిబ్బంది సమస్యల గురించి తెలుసుకున్నారు.

నామినేషన్ కేంద్రంలో హెల్ప్‌డెస్క్ తప్పనిసరి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్/మోమిన్‌పేట్/నవాబుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ కేంద్రంలో హెల్ప్ డెస్క్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పులుమద్ది పంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. హెల్ప్‌డెస్క్ ద్వారా అవసరమైన సమాచారం అందించాలన్నారు. నిర్ణీత గడువులోగా నామినేషన్లు స్వీకరించేందుకు టోకెన్ల విధానాన్ని పాటించాలని తెలిపారు. ఆయనతోపాటు ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి, ఎంపీడీవో నవీన్ కుమార్, ఎంఆర్‌వో లక్ష్మీనారాయణతో పాటు అధికారులు పాల్గొన్నారు.

విజయవంతంగా నామినేషన్ల స్వీకరణ

జిల్లాలో మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.



పులుమద్దిలో నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా, మండల స్థాయిలలో అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. రాండమైజేషన్ ద్వారా ఎన్నికల సిబ్బందిని, అవసరమైన బ్యాలెట్ బాక్సులను కేటాయించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ స్నేహ మెహ్రా, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, వ్యయ పరిశీలకులు రమేష్ కుమార్, అదనపు కలెక్టర్ సుధీర్, డీపీవో జయసుధ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా ఉండాలి

నామినేషన్ల స్వీకరణలో తప్పిదాలు, పొరపాట్లకు తావు ఇవ్వరాదని అధికారులకు కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. మోమిన్‌పేట్, వెల్చాల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధికారులు విధులు బాధ్యతగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే కొత్త బ్యాంక్ ఖాతా ద్వారానే లావాదేవీలను నిర్వహించాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని అని అన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో సృజన సాహిత్య, తహసీల్దార్ రవీంద్ర, ఎంపీవో యాదగిరి, పంచాయతీ కార్యదర్శులు స్వప్న, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

నవాబుపేట మండలంలో..

నామినేషన్ల స్వీకరణలో అధికారులు తప్పిదాలకు తావు ఇవ్వొద్దని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. నవాబుపేట మండలంలో నామినేషన్ కేంద్రాలను ఆయన అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీ చేసిన అభ్యర్థులు విధిగా ఎన్నికల కమిషన్ ఇచ్చిన నిబంధనలను పాటించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో అనురాధ, అధికారులు ఉన్నారు.



కీసరలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో నీళ్లచారుతో భోజనం చేస్తున్న విద్యార్థులు

కడుపు నిండట్లే!

నిత్యం పప్పు, ఆలుగడ్డతోనే సరి
చాలీచాలని కూరలతో అరకొర ఆహారం
ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకుంటున్న విద్యార్థులు
బిల్లులు రాక.. పెరిగిన ధరలతో ఏజెన్సీల ఇక్కట్లు

మధ్యాహ్నంపై కూరగాయల ధరల ఎఫెక్ట్



ఆహారం వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

మేడ్చల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కూరగాయల ధరలు కొండెక్కడంతో.. పెరిగిన ధరల ప్రభావం విద్యార్థులకు ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజన పథకంపై ప్రభావం చూపుతోంది. కొద్ది రోజులుగా కాయగూరల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. అన్ని కూరగాయల ధరలు సెంచరీకి చేరువలో ఉన్నాయి. దీంతో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులు ఆహారాన్ని విద్యార్థులకు అందించలేకపోతున్నారు. దీంతో రుచికరమైన ఆహారం అందక విద్యార్థుల కడుపు నిండని పరిస్థితి నెలకొంది. దీంతో పలువురు విద్యార్థులు ఇంటినుంచే టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటున్న పరిస్థితి నెలకొంది.

జిల్లాలో మొత్తం 505 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో దాదాపు 85 వేల మంది

మిగతా 8వ పేజీలో...

ప్రజావాణికి 129 ఫిర్యాదులు

అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 129 ఫిర్యాదులు, వినతులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన డీఆర్‌వో హరిప్రియతో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి దృష్టికి వచ్చే సమస్యలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని, పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరపాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

రైతుల హక్కులు కాపాడుకోవాలి

నూతన విత్తన చట్టంలో రైతుల హక్కులు కాపాడుకోవాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో నూతన విత్తన చట్టం ముసాయిదా బిల్‌పై సోమవారం కలెక్టరేట్‌లో వివిధ లబ్ధిదారులు, ప్రయోజనకారులతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్రామ్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు, రైతులు, విత్తన కంపెనీ ప్రతినిధులు, డీలర్లు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన విత్తన చట్టం ముసాయిదాపై చర్చించారు.

ఉచిత అంబులెన్స్ సేవలు అభినందనీయం

స్పీకర్ ప్రసాద్ కుమార్

వికారాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం ఉచిత అంబులెన్స్ సర్వీసును ఏర్పాటు చేయడం అభినందనీయమని శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో సందీప్ మెడికల్ ఏజెన్సీస్ అండ్ క్లినిక్ నిర్వాహకులు సందీప్ చారిట్రబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కోటపల్లి సందీప్ ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్ సర్వీసును స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రోగులు, క్షతగాత్రులు ఎవరైనా కేవలం వాహనానికి ఇంధన చార్జీలు మాత్రమే భరించి వికారాబాద్ జిల్లాలోని ఏదైనా ఆసుపత్రికి, హైదరాబాద్‌లో ఉన్నత ఆసుపత్రులకు చేర్చేందుకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సేవలను అత్యవసర పరిస్థితిలో ఎవరైనా వినియోగించుకోవచ్చని తెలిపారు.



అంబులెన్స్ సర్వీసును ప్రారంభిస్తున్న ప్రసాద్ కుమార్




ధారూరు సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేస్తున్న కల్వ సువర్ణ

రెండో విడత.. రెండో రోజు నామినేషన్ల జోరు..!

సర్పంచ్ పదవులకు 574.. వార్డులకు 1,260

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రెండో విడతలో జరగనున్న 175 పంచాయతీలకు, రెండో రోజు సోమవారం 1,468 నామినేషన్లు వచ్చాయి. సర్పంచ్‌లకు 390, వార్డు పదవులకు 1,078 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆదివారం సర్పంచ్ పదవులకు 184, వార్డు పదవులకు 182 నామినేషన్లు వచ్చిన విషయం తెలిసిందే. రెండు రోజుల్లో సర్పంచ్ పదవులకు 574 నామినేషన్లు, 1520 వార్డు స్థానాలకు 1,260 నామినేషన్లు దాఖలయ్యాయి. వికారాబాద్ మండలంలో 21 పంచాయతీల్లో సర్పంచ్ పదవుల కోసం 86, ధారూరు మండలంలో 34 పంచాయతీలకు 95, మోమిన్‌పేట్ మండలంలో 29 పంచాయతీలకు 93, నవాబ్‌పేట్ మండలంలో 32 పంచాయతీలకు 108, బంట్వారం మండలంలో 12 పంచాయతీలకు 43, మర్పల్లి మండలంలో 29 పంచాయతీలకు 89 నామినేషన్లు, కోట్‌పల్లి మండలంలో 18 పంచాయతీలకు 60 నామినేషన్లు చొప్పున నామినేషన్లు వచ్చాయి. కాగా, నామినేషన్ల స్వీకరణ నేటి సాయంత్రం 5 గంటలతో ముగియనుంది.



జర్నలిస్టుల మహాధర్నాను విజయవంతం చేయాలి


మేడ్చల్ కలెక్టరేట్ వద్ద మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరణ చేస్తున్న జర్నలిస్టులు

మేడ్చల్/షాబాద్/చేవెళ్ల, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ టీయూడబ్ల్యుజే-ఐజేయూ ఆధ్వర్యం లో డిసెంబరు 3న రాష్ట్ర సమాచార శాఖ ఐజే యూ కమిషనర్ కార్యాలయం వద్ద చేపట్టనున్న జర్నలిస్టుల మహాధర్నాను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు బాలరాజ్, వెంకట్రాంరెడ్డిలు పిలుపునిచ్చారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద మహాధర్నాకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జర్నలిస్టులకు అమలైన సంక్షేమ పథకాలను సైతం తెలంగాణ రాష్ట్రం వచ్చాక అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి వెంకట్‌రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు నాగేంద్రచారి, వివిధ పత్రికల జిల్లా స్టాఫ్‌రిపోర్టర్లు కృష్ణ, రవి, రామారావు, శ్రీనివాస్, రవికిరణ్‌రెడ్డి, రామకృష్ణ, యాదగిరి, జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సింగ్‌రావు, గిరిబాబు, రవి, శ్రీధర్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. జర్నలిస్టుల మహాధర్నాను విజయవం తం చేయాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు సలీం పాషా, శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. షాబాద్‌లో సంఘం నాయకులతో కలిసి మహాధర్నా పోస్టర్ను ఆవిష్కరించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోందన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే బాటలో నడుస్తోందన్నారు. జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్, హెల్త్ కార్డులు వెంటనే ఇవ్వాలన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. డిమాండ్ల సాధనకు జర్నలిస్టులందరూ ధర్నాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీనియర్ జర్నలిస్టులు రాంచంద్రయ్య, రమేష్, రవీందర్‌గౌడ్, గోపాల్, శ్రీనివాస్‌గుప్తా, మల్లికార్జున్, వెంకటేశ్, కరుణాకర్‌చారి, రాఘవేందర్ గుప్తా, లక్ష్మణ్, శ్రవణ్ పాల్గొన్నారు. చేవెళ్లలో డిసెంబరు 3న జరిగే మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణలో సంవత్సరాలుగా అత్యంత నిరాదరణకు గురైన వర్గం జర్నలిస్టులే అని చెప్పారు. ఉద్యమంలో కీలక భూమిక పోషించిన జర్నలిస్టుల జీవితాలు మెరుగుపడలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అందిన ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలు సైతం అందడం లేదని వాపోయారు. హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద 3న ఉదయం 10గంటలకు మహాధర్నా ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఆనంద్, గోపాల్, రాకేశ్, మధు, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్, దయాకర్, ఆనంద్, రాజు, ప్రసాద్, యాసిన్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.


షాబాద్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

పంతూ నాయక్ సేవలు చిరస్మరణీయం



పంతూనాయక్ ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, నాయకులు

కడ్తాల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంతూ నాయక్ గొప్ప ఆశయ సాధకుడని, ఆయన సేవలు చిరస్మరణీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మనుషులు జీవితకాలంలో చేసిన మంచి పనులు మరణాంతరం కూడా కీర్తించబడుతాయని, అందుకు దివంగత ఆమనగల్లు మాజీ ఎంపీపీ రామావత్ పంతూనాయక్ నిదర్శనమని అన్నారు. ప్రతి మనిషి ఉన్నంతలో పరులకు సాయమందించి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని కోరారు. మాజీ ఎంపీపీ, మైసిగండి మైసమ్మ ఆలయ వ్యవస్థాపకులు పంతూనాయక్ 18వ వర్ధంతిని మైసిగండిలో సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పంతూనాయక్ విగ్రహానికి, ఘాట్ వద్ద అభిమానులు, ప్రజాప్రతినిధులు,పంతూనాయక్ సతీమణి సిరోలితో కలిసి పూలమాలలు వేశారు. పంతూనాయక్ ఆశయ సాధనకు మైసిగండి గిరిజనులంతా ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్పీ జ్యోతిఅరుణ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ కనుమరుగు

స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగు కాక తప్పదని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. కడ్తాలకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మూడ రవి ఆధ్వర్యంలో కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన మాట్లాడుతూ.. ప్రగతి నిరోధకులకు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో వే ణుగోపాల్, వెంకటేశ్, లక్ష్మయ్య, చందోజీ, రాం చందర్ పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో సత్యం, మహేశ్, ప్రశాంత్, రవి ఉన్నారు.







గ్యారెంటీల అమల్లో ప్రభుత్వం విఫలం


ఎమ్మెల్యే సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

కందుకూరు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీల అమల్లో విఫలమైందని మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితారెడ్డి అన్నారు. సోమవారం ఆకులమైలారం మాజీ ఉపసర్పంచ్ రాంరెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు నగరంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి బీఆర్ఎస్‌లో జాయిన్ అయ్యారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ.. గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, సురేందర్, పాండు, తిరపతయ్య, వెంకటాచారి పాల్గొన్నారు.

రోడ్డు పనులను అడ్డుకున్న రైతులు


కుర్మిద్ద తండా వద్ద రోడ్డు పనులకు వచ్చిన ఎల్‌అండ్‌టీ కార్మికులు

యాచారం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మిద్ద తండా వద్ద రోడ్డు పనులు చేసేందుకు మిషన్లతో వచ్చిన ఎల్‌అండ్‌టీ కంపెనీ కార్మికులను రైతులు అడ్డుకున్నారు. 'మా భూమి తీసుకొని పూర్తిగా పరిహారం ఇవ్వలేదు. డబ్బులు ఇవ్వకుండా మా భూమిలో రోడ్డు పనులు చేయొద్దు.' అని రైతులు పనులను అడ్డుకున్నారు. కార్మికులు రైతుల మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. రైతులు పనులను అడ్డుకున్నారనపి కార్మికులు కంపెనీ సూపర్‌వైజర్లకు సమాచారమిచ్చారు. తాము రోడ్డు పనులను అడ్డుకున్నామని రైతులు ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి తెలిపారు. మంగళవారం ఎల్‌అండ్‌టీ కంపెనీ అధికారులు, టీజీఐఐసీ., రెవెన్యూ అధికారులు రోడ్డు పనులు చేసే ప్రదేశానికి వచ్చి రైతులతో మాట్లాడతారని తెలుస్తోంది.

మాల్‌లో పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు

● తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించిన పోలీసులు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

యాచారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్‌లో నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై యాచారం పోలీసులు చెక్‌పోస్టు వద్ద సోమవారం నుంచి యాచారం సీఐ ఏ.నంధీశ్వర్‌రెడ్డి, ఎస్సై మధులు వాహనాలను తనిఖీ చేశారు. వచ్చీపోయె వాహనాలను తనిఖీ చేసింతర్వాతే వదిలేస్తున్నారు. మధ్యాహ్నం నుంచి డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. డ్రైవింగ్ పత్రాలు, ఆర్సీలు లేని వాహనాలకు జరిమానా విధిస్తున్నారు. వాహనాదారులు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలని పోలీసులు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ఇకపై 24గంటల పాటు ఈ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తామని పోలీసులు తెలిపారు.

ఘనంగా గీతాపారాయణం


చేవెళ్ల హనుమాన్ ఆలయంలో గీతా పారాయణం చేస్తున్న భక్తులు

చేవెళ్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలోని హనుమాన్ ఆలయంలో గీతపారాయణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. భగవద్గీత జయంతి, గీతాయజ్ఞాన్ని పురస్కరించుకొని పట్టణంలోని హనుమాన్ ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు హోమాలు నిర్వహించారు. దంపతులు, మహిళలు గీతా పారాయణం చేశారు. ప్రతీ ఒక్కరు దైవచింతన కల్గి ఉండాలని నిర్వాహకులు సూచించారు. గీతాపారాయణంతోనే మనస్సు ప్రశాతంగా ఉంటుందన్నారు.

ప్రజావాణి సమస్యలు వెంటనే పరిష్కరించాలి

● జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ➤



వికారాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రజాఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన 16 ఫిర్యాదులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చిన పెన్షన్, వ్యవసాయం, భూసమస్యలపై ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో మంగ్లీలాల్, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈ-రీసెట్ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌తో విజ్ఞాన్ మహిళా కళాశాల ఎంవోయూ


ఒప్పందాలు మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ఘట్‌కేసర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈ-రీసెట్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ అండ్ ఇంజినీరింగ్, టెలీ కమ్యూనికేషన్స్ సికింద్రాబాద్ వారితో ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి కొండాపూర్‌లో గల విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం యాజమాన్యం వివిధ అంశాలపై పలు కీలక ఒప్పందాలు చేసుకున్నట్లు కళాశాల యాజమాన్యం సోమవారం తెలియజేశారు. వివిధ అంశాలపై ఇలాంటి కీలక ఒప్పందాలు చేసుకోవడంలో విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కాలేజీ రాష్ట్రంలోనే మొదటిదని తెలిపారు. ఈ ఎంవోయూతో విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని మరింత మెరుగుపర్చుకునే వీలుంటుందని చెప్పారు. ప్రధానంగా వివిధ ప్రాజెక్టులపై శిక్షణ, వర్క్‌షాప్‌లు, సెమినార్లతో పాటు ప్లేస్మెంట్స్ పొందేం దుకు దోహదపడుతుందని తెలిపారు. ఇందుకు శ్రమించిన కళాశాల సీఈవో శ్రావణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పారావు నాయుడు, ప్రొఫెసర్లు పులయ్య, పద్మలీల, మస్తాన్, శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఏవైనా గెలుపు బీజేపీదే...


బీజేపీలో చేరిన వారితో మాట్లాడుతున్న అందెల శ్రీరాములుయాదవ్

మహేశ్వరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లా పరిషత్‌తో పాటు మెజారిటీ ఎంపీపీ, సర్పంచ్‌ల స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని, ఎన్నికలు ఏవైనా మహేశ్వరంలో కమలం జెండా ఎగరడం ఖాయం అని జిల్లా బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. బీజేపీ మహేశ్వరం మండలాధ్యక్షుడు యాదీష్ ఆధ్వర్యంలో సోమవారం మొహబ్బత్ నగర్‌లో పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు 420హామీల అమలులో విఫలమైందన్నారు. బీసీ, ప్రజావ్యతిరేకతను అధిగమించాలనే కుట్రతోనే బీసీ రిజర్వేషన్ అంశాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. ఎన్నికల్లో విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, రామ్‌రెడ్డి, కృష్ణ, శేఖర్, దేవేందర్, ఆంజనేయులు, నరేందర్, భాస్కర్, విజయ్, రవి, శివ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు కేటాయించాలని ధర్నా


ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు

కందుకూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తమకు డబుల్ బెడ్ రూములను వెంటనే కేటాయించాలంటూ సరూర్‌నగర్ మండలానికి చెందిన లబ్ధిదారులు సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడారు. గత ప్రభుత్వం తమకు ఇళ్లను మంజూరు చేసి మంఖాల్-1(సర్ధార్‌నగర్)లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయించిందని ఆవేదన వ్యక్తం చేశారు. 702 మంది వాటిల్లో నివాసాలు ఉంటుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అందులో 640 మందికి మాత్రమే డబుల్ బెడ్‌రూముల పట్టాలు ఇచ్చి, 162 మంది లబ్ధిదారులకు తిరిగి పట్టాలు ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వారితో ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. లబ్ధిదారుల సమస్యను కలెక్టర్ నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

రెడీమిక్స్ ట్రక్కు బోల్తా



శంకర్‌పల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎల్వర్తి మూల మలుపు వద్ద సిమెంటు రెడీ మిక్స్ వాహనం బోల్తా పడింది. శంకర్‌పల్లి వైపు నుంచి చేవెళ్ల వెళ్తున్న సీసీ మిక్సర్ సోమవారం తెల్లవారు జామున ఎల్వర్తి మూల మలుపు వద్ద బోల్తా పడింది. డ్రైవర్ చోటన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూశారు.

అభివృద్ధి పేరిట ఏకగ్రీవాల వైపు ..



బొంరాస్‌పేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని 35 పంచాయతీల్లో ఆరు ఏకగ్రీవమయ్యాయి. సాలిండాపూర్‌లో రిక్కిబాయి, మదన్‌పల్లి తండాలో శంకర్‌నాయక్, జానకంపల్లిలో వెంకటయ్య, నాగిరెడ్డిపల్లిలో అనిత నర్సిములు, కట్టుకాల్వ తండాలో కిషన్‌నాయక్, టేకులగడ్డ తండాలో రామ్‌నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరంతా కాంగ్రెస్ మద్దతుతో ఎన్నికైన వారే. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో



గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తామని కొత్తగా బాధ్యతలు చేపట్టబోయే సర్పంచ్‌లు తెలిపారు. జానకంపల్లిలో రూ.5లక్షలతో ఆంజనేయస్వామి ఆలయ పునరుద్ధరణకు హామీ ఇచ్చారు. నాగిరెడ్డిపల్లిలో బీఆర్ఎస్‌కు ఉపసర్పంచ్ పదవీ ఇస్తే కాంగ్రెస్ మద్దతుదారుడు నర్సిములు సతీమణి పోటీలేకుండా వేలం నిర్వహించారు. సాలిండాపూర్, మదన్‌పల్లి, కట్టుకాల్వ, టేకులగడ్డ తండాల్లో సేవాలాల్, మరియమ్మ ఆలయాలకు రూ.5లక్షల చొప్పున ఇస్తామని ఒప్పందం చేసుకొని వేరేవారు సర్పంచ్‌గా పోటీ లేకుండా చూసుకున్నారు. అలాగే బురాన్‌పూర్‌లో సర్పంచ్ అభ్యర్థి ఎన్నికలో రూ.45.5లక్షలకు గ్రామస్తులు వేలం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి వేలం పాడి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయాన్ని కొత్తగా నిర్మించేందుకు హామీ ఇచ్చారు. అయితే కాంగ్రెస్ అభ్యర్థులు ఒప్పుకోకపోవడంతో సర్పంచ్ పదవి ఏకగ్రీవం కాలేదు.

పంతులూ.. నేను గెలుస్తానా?

జ్యోతిష్యులను ఆశ్రయిస్తున్న అభ్యర్థులు

కులకచర్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలోని ఆయా గ్రామాల్లో సర్పంచ్‌కు పోటీచేసే అభ్యర్థులు జాతకాన్ని చూసుకుంటున్నారు. 'పంతులూ నా జాతకం చూసి చెప్పండి. ఎన్నికల్లో గెలుస్తానా? నా జాతకం ఎలా ఉంది?' అని పోటీ చేయాలనుకుంటున్న వారు జ్యోతిష్యులను ఆశ్రయిస్తున్నారు. సర్పంచ్ కావాలని కోరిక ఉంది. పోటీ చేసి గెలుస్తానా? ఏ రోజు నామినేషన్ వేయాలి? అని ఆరా తీస్తున్నారు. ఫలానా పంతులు జాతకం బాగా చెప్తాడు అంటే.. ఆయన వద్దకే వెళ్లి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. పంతుళ్లు, జ్యోతిష్యుల సూచనల మేరకు ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఏదేమైనా పంచాయతీ ఎన్నికలు ఆశావహులను గుళ్లూ గోపురాల బాట పట్టిస్తున్నాయి. జ్యోతిష్యులు, వేద బ్రాహ్మణులు, పంతుళ్లకు గిరాకీ పెరిగింది!



డబ్బు, మద్యం జాన్తానై..

- విద్యావంతుడై గ్రామంలోనే ఉండాలి
- సమగ్రాభివృద్ధికి పాటుపడాలి
- నిజాయితీ, నిబద్ధత ఉంటేనే ఓటేయాలి
- విద్య, ఆరోగ్యం, వ్యవసాయంపై అవగాహన ఉండాలి
- న్యాయం వైపు నిలవాలి.. పల్లెలో శాంతి పరిరక్షించాలి
- ఇదీ సర్పంచ్ ఎన్నికపై ప్రజల అభిప్రాయం

మంచి వ్యక్తినే సర్పంచ్‌గా ఎన్నుకుందాం..

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల పండుగ మొదలైంది. సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ వేసిన అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం చేస్తున్నారు. మూడు విడతల్లో మరో కొన్ని రోజుల్లో ప్రక్రియ ముగియనున్న ఎన్నికల జాతరలో ఓటర్లు ఎంజాయ్ చేయనున్నారు. పంచాయతీ ఎన్నికలకు విద్యార్హత ఏమీ లేకపోవడంతో పెద్దగా చదువుకోని వారు సైతం ప్రజాసేవకు సై అంటున్నారు. రిజర్వేషన్లతో అవకాశం కోల్పోయిన గ్రామపెద్దలు, సీనియర్ నాయకులు, కొందరు రియల్టర్లు గ్రామంలో తమ అధిపత్యం కోసం తమ అనుయాయులను రంగంలోకి దింపారు.



ఎన్నికల్లో డబ్బు, మద్యం వెదజల్లి గెలువాలన్న ఆలోచనలో కొందరున్నారు. అయితే ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటు వేసి గ్రామాల్లో ప్రజలు పనులు చేయించుకోవాలని మేధావులు, సామాజిక వేత్తలు పిలుపునిస్తున్నారు. అందుకు సర్పంచ్‌గా ఎన్నికయ్యే వ్యక్తికి ఉండాల్సిన గుణగనాలను లెక్కిస్తున్నారు.

ఉండాల్సిన లక్షణాలివీ...

సర్పంచ్‌గా ఎన్నికయ్యే వ్యక్తి విద్యావంతుడై, గ్రామంలోనే ఉండాలి. పరిస్థితులపై సమగ్ర అవగాహన ఉండాలి. సమస్యలను పరిష్కరిస్తూ, గ్రామ అవసరాలను గుర్తించి ప్రణాళికలను రూపొందించాలి. అందరి మాటా వినాలి. గ్రామంలో పారిశుధ్యాన్ని పరిరక్షించాలి. పచ్చదనాన్ని పెంచాలి. ప్రజారోగ్యాన్ని పాటుపడాలి. పేదరిక నిర్మూళనకు, విద్యాభివృద్ధికి చేయూత ఇవ్వాలి. యువతకు ఉద్యోగ, ఉపాధికి బాటలు వేయాలి. ఏదైనా పని చేపట్టే ముందు ఇతర ప్రజాప్రతినిధులను, గ్రామ నాయకులను ఒప్పించాలి. ప్రజా పనులపై తరచూ అధికారులను కలుస్తుండాలి. గ్రామాభివృద్ధిని సాధించేవాడై ఉండాలి. ప్రజల్లో నెలకొనే తగవులపై పంచాయతీలో చర్చ పెట్టాలి. న్యాయంవైపు తీర్పు చెప్పే సమర్థత కలిగి ఉండాలి. గ్రామంలో నిరంతరం శాంతిభద్రతలను కాపాడేలా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ రంగంపై అవగాహనుండాలి. ఆధునిక సాగుబడి, గిట్టుబాటు ధరలపై రైతుల్లో చైతన్యం తేవాలి. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. వ్యవసాయానుబంధంగా పండ్ల తోటలు, కోళ్ల, పెంపకం, పాడి పరిశ్రమ, చేపల పెంపకం వంటి రోజువారీగా ఆదాయాన్ని తెచ్చే పనులకు ప్రోత్సాహాన్ని అందించాలి. గ్రామంలో విద్యుత్తు, రవాణా, రోడ్ల సమస్యలు తలెత్తకుండా చూడాలి. ప్రతీ పనిలో పారదర్శకత చూపుతుండాలి.

ఆశయం ఉన్న అభ్యర్థికే ఓటు వేయాలి



పదవిపై ఆశతో కాకుండా గ్రామాభివృద్ధి ఆశయం ఉన్న అభ్యర్థికి ఓటు వేయాలి. గ్రామంపై అవగాహన ఉండి, అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సమయం ఇచ్చేవాడై ఉండాలి. అందరినీ సమన్వయపర్చి, సమర్థతతో సమస్యలను పరిష్కరించే వ్యకినే మనం గెలిపించుకోవాలి. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఓటు వేయాలి. విద్యకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలు అభివృద్ధి వైపు నడిచేలా చైతన్యం తెచ్చే నాయకుడిని ఎన్నుకోవాలి.

- వి.గంగిరెడ్డి, విద్యావేత్త, షాద్‌నగర్

ప్రలోభాలకు లొంగొద్దు



గెలిచిన నాటి నుంచి ఐదేళ్లు గ్రామాభివృద్ధికి పాటుపడే వ్యక్తినే సర్పంచ్‌గా ఎన్నుకోవాలి. ఎన్నికల సమయంలో ఐదు రోజుల ఆనందం కోసం ప్రలోభాలకు లొంగి ఓటును అమ్ముకోవద్దు. డబ్బు, మందు, బిర్యానీకి ఆశపడి గ్రామ భవిష్యత్తును పాడుచేయొద్దు. ఓట్ల కొనుగోలుకు పెట్టే ప్రతి రూపాయిని వడ్డీతో సహా గ్రామం నుంచే వెనకేసుకుంటారనే వాస్తవాన్ని ప్రజలు తెలుసుకోవాలి. నిజాయితీ, నిబద్ధతతో గ్రామాభివృద్ధికి కృషిచేసే వ్యక్తినే సర్పంచ్‌గా ఎన్నుకోవాలి.

- జి.శ్యాంసుందర్, మొగలిగిద్ద

వ్యవసాయంపై పట్టుండాలి



దేశానికి అన్నం పెడుతున్న వ్యవసాయ రంగంపై సర్పంచ్ అభ్యర్థికి పట్టు ఉండాలి. రసాయనిక వ్యవసాయాన్ని తగ్గిస్తూ సేంద్రియ సాగువైపు రైతులను ఉద్యుక్తుల్ని చేసేలా సమర్థుడై ఉండాలి. వ్యవసాయం దండగ కాదు.. పండుగ అనేలా రైతులకు సాగుబడి, గిట్టుబాటు ధరలపై అవగాహన కల్గించేలా కృషి చేయాలి.

- మందడి నరేందర్‌రెడ్డి, సామాజిక వేత్త, మధురాపురం

ప్రజా సేవకుడినే ఎన్నుకోవాలి



ఐదేళ్లు గ్రామ అభివృద్ధికి, ప్రజల మంచి చెడుల్లో తోడుండే సామాజిక దృక్పథం ఉన్న వ్యక్తినే ఎన్నుకోవాలి. సర్పంచ్‌గా సేవ చేసి, పేరు తెచ్చుకునే వాడై ఉండాలే తప్ప.. ఎన్నికల్లో పెట్టుబడిపెట్టి వ్యాపార ధోరణితో రాజకీయం చేసే వారిని ప్రజాప్రతినిధి పదవులకు దూరం పెట్టాలి. ఎన్నికలు పూర్తికాగానే అందర్నీ కలుపుకొని అభివృద్ధి చేస్తూ, శాంతిభద్రతలను కాపాడుతూ, నిజాయితీగా వ్యవహరిస్తాడనే వ్యక్తినే సర్పంచ్‌గా, వార్డు మెంబరుగా ఎన్నుకోవాలి.

- బి.సిద్ధార్థ, మాజీ సర్పంచ్, గంట్లవెల్లి

వేడెక్కిన పల్లెపోరు

అభ్యర్థులను వెంటాడుతున్న ఎన్నికల ఖర్చుల భయం

బషీరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చలికాలంలో పల్లెలన్నీ పంచాయతీ ఎన్నికలతో వేడెక్కాయి. మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ ముగియగా గ్రామాల్లో సందడి నెలకొంది. ఎలాగైనా సర్పంచ్‌గా గెలవాలని కొందరు అభ్యర్థులు ఖర్చుకు వెనుకాడటం లేదు. నామినేషన్ల ముందు రోజు నుంచే ఓటర్లను ఆకట్టుకునేందుకు పావులు కదుపుతూ మద్యం పార్టీలిస్తున్నారు. అధికార పార్టీ మద్దతుదారులు మందు, విందు పంపకాలకు పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నట్టు గ్రామస్తుల ద్వారా తెలుస్తోంది.

ఎంత ఖర్చయినా తగ్గేదే లే...

రూ.5లక్షల నుంచి రూ.30లక్షల వరకు వెచ్చించే యోచన

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ బరిలో ఉన్న వారు ఖర్చులకు వెనకడుగు వేయడం లేదు. చిన్న పంచాయతీల్లో కనీసం రూ.5లక్షలు, పెద్ద పంచాయతీల్లో రూ.25 నుంచి రూ.30లక్షల వరకు ఖర్చు చేసేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉంటే తమ సొంత డబ్బులకుతోడు పార్టీ నాయకులు ఇచ్చే ఎన్నికల ఖర్చులపై సైతం కొందరు అభ్యర్థులు అశలు పెట్టుకున్నారు.

ధారూరులో వార్డు రిజర్వేషన్‌పై గందరగోళం

- మొదట బీసీ.. తరువాత జనరల్ మహిళ అని పేర్కొన్న అధికారులు

ధారూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ధారూరు పంచాయతీలోని 11వ వార్డు రిజర్వేషన్‌పై సోమవారం గందరగోళం నెలకొంది. ఈ వార్డుకు నామినేషన్ వేసిన తర్వాత రిజర్వేషన్ మారిందని వేరే నామినేషన్ వేయాలని అధికారులు తెలపడంపై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నామినేషన్ రెండో రోజు సోమవారం 11వ వార్డు నుంచి బీఆర్ఎస్ నుంచి మైతాబ్ నామినేషన్ వేశాడు. అధికారులు నామినేషన్‌ను స్వీకరించి మైతాబ్‌కు రశీదిచ్చారు. తర్వాత అధికారులు 11వ వార్డు రిజర్వేషన్ జనరల్(ఓసీ) మహిళ ఉందని, ఏ కులం వారైనా మహిళలే వేయాలని నామినేషన్ కేంద్రం నుంచి అధికారులు మైతాబ్‌కు ఫోన్ చేశారు. దీంతో మైతాబ్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి నామినేషన్ సెంటర్‌కు వెళ్లి అధికారులను ప్రశ్నించాడు. తమకు ఇచ్చిన రిజర్వేషన్ల జాబితా ప్రకారమే నామినేషన్ వేశామని, నామినేషన్‌ను వెనక్కి తీసుకునే ప్రసక్తి లేదని బీఆర్ఎస్ నాయకులు అధికారులకు తేల్చి చెప్పారు. ఈ విషయమై ఎన్నికల సంఘానికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కాగా ఈ విషయమై ఎంపీడీవో నర్సింహులును వివరణ కోరగా.. ఒక్కసారి రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాత రిజర్వేషన్లను మార్చే వీలు లేదని, ఈ విషయంగా ఎక్కడ పొరపాటు జరిగిందో పరిశీలిస్తామని ఆయన చెప్పారు.

సర్పంచ్ నుంచి డీసీసీబీ చైర్మన్ వరకు..

- ప్రజలకు సేవలందించిన లక్ష్మారెడ్డి



తాండూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ మండలం రుద్రారానికి చెందిన లక్ష్మారెడ్డి సర్పంచ్‌గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ వరకు ఎదిగారు. నాగులపల్లి, గోపాల్‌పూర్, రుద్రారం గ్రామాలు ఉమ్మడి పంచాయతీకి లక్ష్మారెడ్డి తండ్రి పెద్దబాల్‌రెడ్డి మొదటి సర్పంచ్‌గా పనిచేశారు. తర్వాత ఆయన రాజకీయ వారసత్వాన్ని స్వీకరించిన లక్ష్మారెడ్డి గోపాల్‌పూర్, రుద్రారం ఉమ్మడి పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. తర్వాత రెండు గ్రామాలు విడిపోయి రుద్రారం స్వతంత్ర పంచాయతీ అయిన తర్వాత రెండోవసారి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. లక్ష్మారెడ్డి అంచెలంచెలుగా ఎదిగారు. తట్టేపల్లి పీఎసీఎస్ చైర్మన్‌గా, తాండూరు మున్సిపల్ చైర్మన్‌గా, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా పని చేశారు.

సర్పంచి వేతనం రూ.6,500

బషీరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవిని దక్కించుకునేందుకు ఆశావహులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సర్పంచికి ఇచ్చే గౌరవ వేతనంపైనా చర్చ నడుస్తోంది. ప్రసుత్తం సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం రూ.6,500 వేలు ఉంది. గతంలో రూ.5వేలు ఉండగా, గత ప్రభుత్వం అదనంగా రూ.1,500 పెంచింది. అయితే ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు ఎలాంటి గౌవర వేతనం ఉండదు.

రేపటి నుంచి నామినేషన్లు

- తుది విడత పంచాయతీ పోరు
- తమ అభ్యర్థులెవరో తేల్చని ప్రధాన పార్టీలు

పరిగి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తుది విడత పంచాయితీ ఎన్నికలు జరిగే పరిగి నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. మొదటి విడత తాండూరు, కొడంగల్‌లలో నామినేషన్ ప్రక్రియ పూర్తిగా రెండో విడత ఎన్నికలు జరిగే వికారాబాద్‌లో నామినేషన్ల ప్రక్రియ మంగళవారం(నేటి)తో ముగుస్తుంది. మూడో విడత పరిగి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 157 పంచాయితీలకు రేపటి నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. పోలింగ్ ఈ నెల 17న నిర్వహిస్తారు. పరిగి, పూడూరు, దోమ, కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో ఎన్నికలుంటాయి. నామినేషన్ల ఘట్టం దగ్గర పడుతుండటంతో ఆయా పార్టీలు బలపర్చే అభ్యర్థులను ఖరారును చేయడం లేదు. కొన్ని చోట్ల నాయకులకు రిజర్వేషన్లు అనుకూలించలేదు. దీంతో వేరే అభ్యర్థుల ఎంపికకు ఇబ్బంది పడుతున్నారు. నామినేషన్లకు సమయం దగ్గర పడుతున్నార పార్టీ తరఫున ఎవరికీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకపోవడంతో సర్పంచ్ పదవులకు పోటీ చేసేవారిలో ఉత్కంఠ నెలకొంది. సర్పంచ్ స్థానాల్లో గెలిస్తే పార్టీ సింబల్ మీద నిర్వహించే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో తమ అభ్యర్థుల గెలుపు సులువు అవుతుందని పార్టీల నాయకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి పార్టీ అభ్యర్థికి మద్దతు ప్రకటించాలంటే పార్టీ మండల అధ్యక్షుడి నిర్ణయం కూడా కీలకం కానుంది. గ్రామ నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరు సర్పంచ్‌గా పోటీ చేసే తమ అభ్యర్థికి మద్దతివ్వనున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచే సర్పంచ్ అభ్యర్థులు మద్దతు కోరుతున్నారు.

నామినేషనైతే వేద్దాం..

మొదట నామినేషనైతే వేసి అనంతరం పార్టీ నాయకుల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామాల్లో తమ పార్టీ నాయకులు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకున్నా నామినేషన్ల ఉపసంహరణ వరకు చూద్దామని ధోరణిలో సర్పంచ్ అభ్యర్థులు ఉన్నారు. గతంలో నామినేషన్లకు ముందుగానే పార్టీలు బలపరిచే అభ్యర్థులను తేల్చేవారు. ఈ సారి మాత్రం అలా జరగడం లేదు. రిజర్వేషన్లు మారడంతో ఏ గ్రామంలో పార్టీ నుంచి ఎవరిని నిలపాలనే సందిగ్ధంలో నాయకులు ఉన్నారు. అయితే పరిగి నియోజకవర్గంలో మాత్రంకాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకుంటున్నాయి. పట్టున్న చోట బీజేపీ కూడా ప్రయత్నాలు మొదలుపెట్టింది.

30ఏళ్లు సర్పంచ్‌గా 'చాట్ల' దంపతులు

- ఐదు సార్లు భర్త.. ఒక పర్యాయం భార్య సర్పంచ్‌గా సేవలు



చాట్ల బస్వరాజ్ దంపతులు

తాండూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఒకే పార్టీలో కొనసాగుతూ ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేసిన చాట్ల బస్వరాజ్ దంపతులకు యాలాల మండలం కమాల్‌పూర్ వాసులు 30ఏళ్ల సర్పంచ్‌గా అవకాశం కల్పించారు. చివరికి వారంతట వారే పోటీకి దూరంగా ఉన్నారు. ప్రజల హృదయాల్లో ఇప్పటికి నిలిచిపోయారు. యుక్త వయసులోనే కాంగ్రెస్‌లో చేరిన చాట్ల బస్వరాజ్ మొదటిసారి 1969లో నాగసమందర్, అన్నాసాగర్, కమల్‌పూర్ ఉమ్మడి పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. రెండోసారి కమల్‌పూర్, బానాపూర్, అడాల్‌పూర్ ఉమ్మడి పంచాయతీగా సర్పంచిగా పనిచేశారు. తర్వాత కమల్‌పూర్‌నకు మూడు సార్లు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. కాగా రెండు సార్లు ఆయన ఏకగ్రీవ సర్పంచిగా పనిచేశారు. మొదటిసారి 1969 సర్పంచ్‌గా ఏకగ్రీవమైన సమయంలో ఆయన వయసు 18 సంవత్సరాలు. ప్రస్తుతం బస్వరాజ్ వయస్సు 76 సంవత్సరాలు. తర్వాత ఆయన సతీమణి మహదేవమ్మ సర్పంచ్‌గా పనిచేశారు. అనంతరం వారు రాజకీయాల్లో చురుగ్గా ఉన్నా సర్పంచిగా పోటీకి ఆసక్తి చూపలేదు.



చాట్ల బస్వరాజ్

కాంగ్రెస్ మద్దతు దారులను గెలిపించాలి

కడ్తాల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కడ్తాల పంచాయతీ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా రాయికంటి బిక్షపతి పేరును ప్రకటించారు. సర్పంచ్ అభ్యర్థిత్వానికి పార్టీ సీనియర్ నాయకుడు గురిగళ్ల లక్ష్మయ్య, బిక్షపతి పోటీపడ్డారు. దీంతో నాయకులు, కార్యకర్తలతో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, ప్యాక్స్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు సమావేశమై అభిప్రాయ సేకరణ చేశారు. పరిషత్ ఎన్నికల్లో జడ్పీటీసీ, అవకాశం ఇస్తామని లక్ష్మయ్యకు హామీ ఇచ్చి బుజ్జగించారు. దీంతో రాయికంటి బిక్షపతి పేరును పార్టీ శ్రేణులంతా ప్రకటించారు. సోమవారం బిక్షపతిని ఎమ్మెల్యే నారాయణరెడ్డి సత్కరించారు. బిక్షపతిని భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో చందోజీ, జహంగీర్‌బాబా, జహంగీర్‌అలీ, శ్రీను, యాదగిరిరెడ్డి, మహేశ్, రాంచందర్, యాదయ్యగౌడ్, రవి, రాజేశ్, బుచ్చయ్య, మల్లేశ్‌గౌడ్, సత్యం, కృష్ణ, మల్లయ్య పాల్గొన్నారు.

బస్సు ఆపలేదని గొడవ ...

- పోలీసుస్టేషన్‌కు పంచాయితీ



పోలీసుస్టేషన్ ఆవరణలో గుమిగూడిన ప్రయాణికులు

ధారూరు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ మండలం మదనంతాపూర్ తండా నుంచి వికారాబాద్ వైపు వస్తున్న బస్సు రాంపూర్ తండా గేట్ వద్ద ఆపలేదు. దీంతో ధారూరు స్టేజీ వద్ద బస్సును ఆపి రాంపూర్ తండా మాజీ సర్పంచ్ పాండునాయక్ గొడవకు దిగారు. ఈ సంఘటన సోమవారం చోటుచేసుకుంది. మదనంతాపూర్ నుంచి వస్తున్న బస్సులో ప్రయాణికులు నిండుగా ఉండటంతో డ్రైవర్ రాంపూర్ గేట్ వద్ద ఆపలేదు. దీంతో బస్సును వెంబడించిన మాజీ సర్పంచ్ ధారూరు బస్‌స్టేషన్ వద్ద బస్సును అడ్డగించి డ్రైవర్‌తో వాదనకు దిగారు. దీంతో బస్సులో ఉన్న మదనంతాపూర్ తండా మహిళలు పాండునాయక్‌పై కోపగించారు. 'మా బస్సును మీ తండా గేట్ వద్ద ఎందుకు ఆపుతారు? మా తండాలోనే బస్సు నిండిపోయింది. బస్సును ఎందుకు ఆపావ్?' అని ఆయనను నిలదీశారు. మా తండా అడవిలో ఉందని, బస్సు ఆపకపోతే ఎట్ల అని ఆయన ప్రశ్నించగా బస్సులో స్థలం లేనందునే ఆపలేదని డ్రైవర్, కండక్టర్ తెలపటంతో గొడవ పెరిగి పంచాయితీ పోలీసుస్టేషన్ వరకు చేరింది. బస్సును నిలిపిన పాండునాయక్‌పై మదనంతాపూర్ తండా వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు వారిని సముదాయించి బస్సును పంపించేశారు.

సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో గీతాపారాయణం

శంషాబాద్ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో ఆధ్యాత్మిక గురువు త్రిదండి చిన జీయర్ స్వామి అధ్వర్యంలో సోమవారం గీతాపారాయణం నిర్వహించారు. విశ్వశాంతికి సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహించారు. ప్రతి హిందువూ భగవద్గీత పారాయణం చేయాలని ఈ సందర్భంగా చిన జీయర్‌స్వామి సూచించారు. ఉత్సవానికి వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థులు, హైదరాబాద్ భక్తులు తరలొచ్చారు. భగవద్గీత పారాయణంలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి మంగళాశాసనాలు అందజేశారు. కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవానాథ్ జీయర్‌స్వామి, భక్తులు పాల్గొన్నారు.



సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో గీతాపారాయణం పఠిస్తున్న చిన జీయర్‌స్వామి

ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

● పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

కులకచర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో కులకచర్ల మండలంలోని ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ముజాహిద్‌పూర్ గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలతో ఆయన ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, చంద్రభూపాల్, షర్ఫోద్దీన్, కృష్ణ, భీమయ్య పాల్గొన్నారు.

దోమ: పాలెపల్లి గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రదీప్‌రెడ్డి, రామస్వామి, చెన్న కిష్టయ్య, నర్సిములు, బసప్పల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు బ్యాగరి అంజిలయ్య, చంద్రయ్య, వెంకటయ్య కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరగా కండువాలతో రామ్మోహన్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దోమ: కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నెరవేరిన సొంతింటి కల



ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశంలో భాగంగా పూజలు నిర్వహించుకుంటున్న దంపతులు

తాండూరు రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరన్‌కోట్ గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాలకు 104ఇళ్లను మంజూరు చేసింది. అయితే వీటిలో 86ఇళ్లను ఇందిరమ్మ లబ్ధిదారులు పనులు ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన ఇందిరమ్మ లబ్ధిదారులు కార్‌గార్ అంబిక ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. దీంతో ఆమె వెంటనే పనులు ప్రారంభించి నిర్మాణపనులు పూర్తి చేశారు. సోమవారం ఆమె బంధువుల సమక్షంలో గృహప్రవేశం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ నాయకులు షైలారం రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ శరణు బసప్ప, తాండూరు నియోజకవర్గ యువ నాయకులు తుపాకుల అనిల్, సుధాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

కీసర రూరల్: అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు పథకం వర్తింపచేస్తామని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. నాగారం మున్సిపాలిటీ 5వ వార్డు పరిధిలో ఇందిరమ్మ ఇల్లు పథకంలో భాగంగా సోమవారం ఇద్దరు లబ్ధిదారులు అనిత, రఘురామ్‌లు నిర్మించుకున్న ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, మాజీ కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, పంగ హరిబాబు, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సతీష్‌గౌడ్, కొండల్‌రెడ్డి, పంబాల రమేష్, కుమార్ పాల్గొన్నారు.



ఇందిరమ్మ గృహ ప్రవేశవేడుకలో వజ్రేష్‌యాదవ్

ఘట్‌కేసర్ రూరల్: ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఫకీర్‌టెక్యాలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఆయన మాజీ సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఘనాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం అవి పూర్తికావొస్తున్నాయని తెలిపారు. మాజీ సర్పంచ్ నానావత్ రూప్‌సింగ్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు వేముల పరమేష్‌గౌడ్, నానావత్ సురేష్‌నాయక్, వేముల సత్తయ్యగౌడ్, శివాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

మేడ్చల్ టౌన్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే మెడిసిటీ సంస్థ లక్ష్యమని శాసనసభ్యులు యలమంచలి సత్యనారాయణ చౌదరి అన్నారు. అమెరికాలోని మినిసోటాకు చెందిన వైద్య విజ్ఞాన మయోక్లినిక్ వైద్య ప్రముఖుల బృదం సోమవారం మేడ్చల్ ఘనాపూర్‌లోని మెడిసిటీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాలను సందర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సత్యనారాయణ చౌదరి మాట్లాడుతూ.. మెడిసిటీ సంస్థ సామాన్యులకు వైద్యసేవలు అందించే దిశగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అమెరికా డాక్టర్ల బృందం శాంతి స్వరూప్, వీఎస్‌వీ ప్రసాద్, ప్రొఫెసర్ శివరామ కృష్ణ పాల్గొన్నారు.



సమావేశమైన అమెరికా వైద్య బృందం

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



తాండూరు: ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్

తాండూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ అన్నారు. తాండూరులో వైద్య ఆరోగ్యశాఖ, దిశాస్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ర్యాలీని నిర్వహించారు. తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జిల్లాలో 3,800 మంది ఎయిడ్స్ చికిత్స పొందుతున్నారని వైద్యాధికారులు తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది కేసుల సంఖ్య తగ్గిందని ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ జయ ప్రసాద్ పాల్గొన్నారు.

పరిగి: పట్టణంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో పరిగి పట్టణ వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి వెంకన్న, విజయలక్ష్మి, రాంనర్సయ్య, రాఘవేందర్ పాల్గొన్నారు. అదేవిధంగా పరిగి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ నివారణపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సునీత పద్మావతి, డాక్టర్ ఎన్.డేవిడ్ విల్సన్ పాల్గొన్నారు.

కులకచర్ల: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం కులకచర్లలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని చౌరస్తా మీదుగా కేవీఎం పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

కడుపు నిండట్లే!

(ఐదో పేజీ తరువాయి)

విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులకు చదువుతో పాటు మంచి భోజనం అందించేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంను అమలు చేస్తోంది. కూరగాయల ధరలు కొండెక్కడంతో తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులకు రుచిగా లేని చారుతో కూడిన కూరలనే అందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఉద్దేశం నీరుగారిపోతోంది. పరిశీలించాల్సిన ఉన్నతాధికారులు కూడా పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. వర్షాల ప్రభావంతో కూరగాయల దిగుబడి తగ్గి జిల్లాలో ధరలు అమాంతం పెరిగాయి. కిలో టమాట రూ.70 పలుకుతోంది. ఇక మిగతా కూరగాయల ధరలు చెప్పనక్కర్లేదు. పెరిగిన కూరగాయల ధరల ప్రభావంతో విద్యార్థులకు సరైన తిండి లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ మెనూని పాటించకుండా తరుచూ పప్పు, ఆలుగడ్డలపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. మరికొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కోడిగుడ్డు కూడా పెట్టడం లేదు. కోడిగుడ్డు ధర కూడా రూ.7 ఉండటంతో గుడ్డును కూడా అందించలేకపోతున్నారు. దీంతో విద్యార్థులు అయిష్టంగానే భోజనం చేస్తున్నారు. జిల్లాలోని ఏ ప్రభుత్వ పాఠశాలలో చూసినా దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. ఓ వైపు బిల్లులు రాకపోవడం మరోవైపు పెరిగిన కూరగాయల ధరలతో మధ్యాహ్న భోజన కార్మికులకు దిక్కుతోచని స్థితి నెలకొంది. పెరగిన కూరగాల ధరలతో విద్యార్థులకు వడ్డించే ఆహారంలో నాణ్యత సైతం లోపిస్తుంది. చేసేదిమి లేక తప్పనిసరి పరిస్థితుల్లో పలువురు విద్యార్థులు ఇంటి నుంచే టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



టిఫిన్ బాక్సు తెచ్చుకుని భోజనం చేస్తున్న విద్యార్థినులు

అరుణాచలానికి హకీంపేట డిపో బస్సులు

శామీర్‌పేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అరుణాచలం టూర్‌కు హకీంపేట డిపోకు చెందిన బస్సులను నడుపుతున్నట్లు డిపో విలేజ్ బస్సు ఆఫీసర్ గోపు శ్రీనివాస్ సోమవారం ఆయన మీడియాకు వెల్లడించారు. ఈనెల 5వ తేదీన సాయంతం 6 గంటలకు బస్సు బయలుదేరనున్నట్లు ఆయన తెలిపారు. ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు టికెట్ ధర పెద్దలకు రూ.4,500, పిల్లలకు రూ.3,500 చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 8008736888 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల సందర్శన

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అకాడమి ఆడిట్ కమిటీ సందర్శించి కళాశాల విద్యా అకాడమిక్ రికార్డులను సమీక్షించింది. కనిష్ఠ వసతులు కూడా లేని పరిస్థితుల్లో కళాశాలను సమర్థవంతంగా నడుపుతున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పీవీ గీతాలక్ష్మీ పట్నాయక్ కృషిని కమిటీ ప్రశంసించింది. ఆడిట్ కమిటీలో కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్వరం ప్రభుత్వడిగ్రీ కళాశాల కామర్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇంతిహాజుద్దీన్, ఫారూకీ సభ్యులుగా పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) రావల్‌కోల్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సీపీఎం ఆర్యదర్శి ఎం.నరేష్ కోరారు. ఈ మేరకు సోమవారం ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ స్వామినాయక్‌కు సీపీఎం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. రావల్‌కోల్ నుంచి రావల్‌కోల్ కమాన్ వరకు వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొమరయ్య, నర్సింగ్‌రావు, పూజ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఈటలను విమర్శించే హక్కు కాంగ్రెస్ నేతలకు లేదు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) బీసీల సంక్షేమం కోసం అహర్నిషలు పాటు పడే మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను విమర్శించే హక్కు కాంగ్రెస్ నేతలకు లేదని మేడ్చల్ పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్ అన్నారు. కాంగ్రెస్ నాయకులు బీసీలకు రిజర్వేషన్ కల్పించటంలో పూర్తిగా విఫలమైందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. బీసీ 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామంటూ చేసిన డిక్లరేషన్‌ను పూర్తిగా కాంగ్రెస్ విస్మరించిందన్నారు. బీసీలకు ఇచ్చిన మాటను నిలబెట్టు కోవాలని ప్రశ్నిస్తున్న తమ పార్టీ ఎంపీని కాంగ్రెస్ నేతలు విమర్శించటం విడ్డూరంగా ఉందన్నారు. తమ నేతలను విమర్శించటం మాని బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని జాకట ప్రేమ్ దాస్ కోరారు.

నేటి నుంచి లొంక ఆంజనేయస్వామి ఉత్సవాలు





కాళ్లాపూర్ లొంక క్షేత్రంలో దేవాలయం

పరిగి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాళ్లాపూర్‌లోని లొంక ఆంజనేయస్వామి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల నిర్వహణకు ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. మంగళవారం(నేడు) ఉదయం గణపతిపూజ, కలశస్థాపన ధ్వజారోహణం, అఖండ దీపారాధన, శ్రీఆంజనేయస్వామి, రాత్రికి భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం నిత్యపూజ హనుమాన్ చాలీసా పారాయణం, సత్సంగప్రవచములు, సాయంత్రం శకటోత్సవములు, రాత్రికి భజన కార్యక్రమం, 4న గురువారం తెల్లవారుజామున నాలుగు గంటలకు రథోత్సవం జరుగుతుంది. 10గంటలకు శ్రీఅంబభవానిమాత బోనాలు, అమృతస్నానం, తీర్థప్రసాదములు కార్యక్రమాలు జరుగుతాయి. గురు, శుక్ర, శనివారాల్లో ఉత్సవాలు భారీఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి



మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌తో కలిసి సర్పంచ్ అభ్యర్థినిగా నామినేషన్ దాఖలు చేస్తున్న అరుణ



మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న మాజీ సర్పంచ్ కవిత

మోమిన్‌పేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. మొరంగపల్లిలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థిని సోమవారం అరుణ నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: కరన్‌కోట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థిగా బోయ అశోక్ కుమార్‌కు తాను మద్దతు ప్రకటిస్తానని కరన్‌కోట్ మాజీ ఉపసర్పంచ్ హేమంత్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. యువతను ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యంతో తాను నామినేషన్ వేయడంలేదన్నారు. బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా బోయ అశోక్ కుమార్ గెలుపునకు ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తానని తెలిపారు.

బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకులు

దోమ: బడెంపల్లి మాజీ సర్పంచ్ కవిత శ్రీనివాస్‌రెడ్డితో పాటు 60మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సమక్షంలో సోమవారం వారు పార్టీలో చేరగా కండువాలతో ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇచ్చి అమలు చేయడం లేదని ఆరోపించారు.

దౌల్తాబాద్: యాంకి గ్రామానికి చెందిన 15 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో సోమవారం వారు పార్టీలో చేరగా కండువాలతో ఆయన ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, మాజీ వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, రమేశ్, కాశప్ప తదితరులు పాల్గొన్నారు.

బుంగమూతులు.. బుజ్జగింపులు!

(ఐదో పేజీ తరువాయి)

ముందుకు సాగుతూ మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈసారి తమకే ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఒక్క ఛాన్స్ ఇవ్వాలంటూ వేడుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ ...రాత్రి వేళ తమ మద్దతుదారులతో సమావేశమై ప్రత్యర్థులకు దీటుగా వ్యూహరచన చేస్తున్నారు. గ్రామాల్లో సామాజిక వర్గాల వారీగా బలాబలాలను బేరీజు వేసుకుంటూ తమకు అనుకూలంగా ఉండే ఓటర్లపై అంచనా వేసుకుంటున్నారు. గతంలో సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులుగా పనిచేసిన వారికి ఈసారి రిజర్వేషన్లు అనుకూలంగా రావడంతో సర్పంచ్ పదవికి పోటీ పడుతున్నారు. తమను ఎన్నుకుంటే దేవాలయాల నిర్మాణాలు, గ్రామాభివృద్ధి పనులు చేపడతామంటూ హామీలు ఇస్తున్నారు.

అధిష్ఠానం మద్దతు ఎవరికో?

ఒకే పార్టీలో ఎక్కువ మంది ఆశావహులు ఉన్న చోట్ల భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. నామినేషన్లు దాఖలు చేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించిన అభ్యర్థులు తమలో పార్టీ అధిష్ఠానం ఎవరికి మద్దతిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రాలతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రభావం అధికంగా ఉండే పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు పోటీ తీవ్రంగా నెలకొనే అవకాశం ఉంది. పరిశ్రమలు ఉండే పంచాయతీల్లోనూ సర్పంచ్ పదవులకు పోటీ పడే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. పార్టీలో చాలా కాలంగా కొనసాగుతున్న వారు అధిష్ఠానం మద్దతు తమకే ఉంటుందన్న ధీమాతో ఉన్నారు. ధన బలం ఉన్న వారు ప్రజల మద్దతు తమకే నన్న విశ్వాసంతో ఉన్నారు. పార్టీలకతీతంగా జరిగే ఎన్నికలైనా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు ఎవరికి వారే ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. బీజేపీ నాయకులు తమ సత్తా చాటుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

పంచాయతీల్లో నామినేషన్ల జోరు

ధారూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 34 గ్రామ పంచాయతీలు, 286 వార్డు మెంబర్ స్థానాలకు సోమవారం అభ్యర్థులు నామినేషన్ కేంద్రాలకు వచ్చి నామినేషన్ దాఖలు చేశారు.

సర్పంచ్ బరిలో రిటైర్డ్ హెచ్‌ఎం

కొడంగల్ రూరల్: విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచారు. మండలంలోని సంగాయిపల్లి గ్రామానికి చెందిన హన్మయ్య ఉపాధ్యాయునిగా 24 సంవత్సరాలు, 7 సంవత్సరాలు ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో సర్పంచ్ బరిలో పోటీ చేస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పుడు విద్యార్థులను తీర్చిదిద్దిన ఆయన రిటైర్డ్‌మెంట్ తర్వాత సర్పంచ్ బరిలో నిలవడం ఆసక్తికరంగా మారింది.

నామినేషన్ల స్వీకరణకు కేంద్రాలఏర్పాటు

పూడూరు: మండలంలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల దాఖలు కోసం అధికారులు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనెల 3వ తేదీ నుంచి ఈనెల 5వ తేదీ వరకు, ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆయా కేంద్రాల్లో నామినేషన్లను స్వీకరించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

నామినేషన్‌లు స్వీకరణకు 11 క్లస్టర్లు

పరిగి: మండలంలోని 32 పంచాయితీల ఎన్నికలకు నామినేషన్‌ల స్వీకరణ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. బరిలో దిగనున్న సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేసేందుకు 11క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్‌లో మూడు పంచాయితీలకు సంబంధించి నామినేషన్‌లు స్వీకరించనున్నారు. ఒక్కో క్లస్టర్‌కు రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

తాండూరు రూరల్/పూడూరు/యాలాల: పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సమస్యత్మాక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తాండూరు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. తాండూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బషీరాబాద్, దామర్‌చేడ్, ఎక్మాయి, నవల్గా, మైల్వార్, పర్వత్‌పల్లి, పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దేముల్, హన్మాపూర్, ఇందూర్, జనగాం, మంబాపూర్, నాగులపల్లి, తట్టేపల్లి, యాలాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాలాల, అగ్గనూర్, జుంటుపల్లి, కోకట్, దేవనూర్, రాస్నం, తాండూరు మండలం కరన్‌కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కరన్‌కోట్, జినగుర్తి, సంగెంకలాన్, మల్కాపూర్, చెంగోల్, అల్లాపూర్, సిరిగిరిపేట్ గ్రామాలు సమస్యత్మాక గ్రామాలుగా గుర్తించామని తెలిపారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే వీడియోలు కానీ, సందేశాలు కానీ పోస్ట్ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌కుమార్, యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు.

పలువురి బైండోవర్

కొడంగల్: లగచర్ల గ్రామానికి చెందిన సురేశ్‌ను సోమవారం దుద్యాల్ తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. లగచర్ల ఘటనలో ఏ2గా ఉన్న సురేశ్ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గొడవలు సృష్టించే అవకాశం ఉందని భావించి ముందస్తుగా తహసీల్దార్ కిషన్, పోలీసుల సమక్షంలో బైండోవర్ చేశారు.

ప్లాట్ల కబ్జాదారుల రిమాండ్

కీసర రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నకిలీ దస్తావేజులతో ప్లాట్లను విక్రయిస్తున్న వ్యక్తిని, అతడికి సహకరిస్తున్న మరో వ్యక్తిని కీసర పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. కీసర సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మున్సిపాలిటీ లక్ష్మినగర్ కాలనీలో నాంపల్లి రమేష్‌రావు అనే వ్యక్తి పదేళ్ల కిందట ప్లాట్‌ను కొనుగోలు చేశాడు. ఇదే వెంచర్‌పై నకిలీ డాక్యుమెంట్లతో ప్లాట్లు విక్రయిస్తున్నట్లు విషయం తెలుసుకుని, రికార్డులు తనిఖీ చేశారు. తన ప్లాట్ నకిలీ డాక్యుమెంట్‌తో రిజిస్ట్రేషన్ ఐనట్లు గుర్తించారు. దీంతో అతను కీసర పోలీసులను ఆశ్రయించారు. విచారణ చేపట్టిన పోలీసులు మౌలాలికి చెందిన మహమ్మద్ ఖాజా పాషా, అతడి అనుచరుడు పోలోజు రామచంద్రయ్యలను నిందితులుగా గుర్తించారు. 1990 నుంచి ఎలాంటి లావాదేవీలు జరగని ప్లాట్లను ఎంచుకుని నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి, డాక్యుమెంట్ రైటర్ల సాయంతో నాటి సబ్‌రిజిస్ట్రార్‌తో కుమ్మక్కై తమ సంబంధీకుల పేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అనతరం ఆ స్థలాన్ని కబ్జా చేయడంతో పాటు బ్యాంకుల నుంచి రుణం పొందినట్లు విచారణలో తేలింది. అదేవిధంగా అమాయకులకు అంటగట్టి భారీ మొత్తంలో డబ్బును సంపాదించినట్లు గుర్తించారు. మహమ్మద్ ఖాజాపాషా, అతడి అనుచరుడు పోలోజు రామచంద్రయ్యలను న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరికొందరి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. యజమానులు ప్లాట్లకు సంబంధించిన రికార్డులను తరచూ తనిఖీ చేసుకోవాలని, అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు తమ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు తెలపాలని సీఐ ఆంజనేయులు సూచించారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్



రాధిక

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ నిబంధనలతో సూచించిన అధ్యయన కోర్సును అభ్యసించిన అధ్యాపకురాలికి డాక్టరేట్ వరించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) తిరుపతికి చెందిన ఎం.రాధిక అనురాగ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ వై.ధర్మేందర్‌రెడ్డి(గణిత విభాగం) పర్యవేణలో 'తాప వికిరణం, ప్రభావం-ఎంహెచ్‌డీ నానోఫ్లూయిడ్ వేడి, ద్రవ్య ప్రసరణ బౌండరీ లేయర్ ప్రవాహ సమస్యలు ప్రసారిత ఉపరితలం'పై థీమ్ నిర్వహించారు. ఈ మేరకు ఆమెకు డాక్టరేట్ దక్కింది. పరిశీలకుల ప్యానెల్ సిఫార్సుల మేరకు రాధికను డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు అర్హత సాధించారని తెలిపారు. దీంతో ఆమెను అనురాగ్ యూనివర్సిటీ అధ్యాపకులు ఆమెను అభినందించారు.

శ్రీవారి సేవలో చీఫ్‌విప్ దంపతులు



తిరుమలలో చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి కుటుంబసభ్యులు

తాండూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మోక్షద ఏకాదశి సందర్భంగా సోమవారం తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామిని శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి కుమారుడు పట్నం రినీష్‌రెడ్డి కూతురు మనీషారెడ్డి అల్లుడు హిమాదిప్‌రెడ్డి దర్శించుకున్నారు.

నీటిట్యాంకు పరిశీలన

కులకచర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముజాహిద్‌పూర్ పరిధిలోని ఎస్సీ కాలనీలో శిథిలావస్థలో ఉన్న నీటి ట్యాంకును సోమవారం మిషన్ భగీరథ తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ లలిత పరిశీలించారు. కూల్చివేతకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్ రవికుమార్, డీఈ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి సంతోష్ ఉన్నారు.

వజ్రేశ్ యాదవ్‌ను కలిసిన నాయకులు

ఘట్‌కేసర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన తోటకూర వజ్రేశ్ యాదవ్‌ను సోమవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన ఎన్ఎఫ్‌సీనగర్ మాజీసర్పంచ్ మేడబోయిన వెంకటేష్, సహకార సంఘం మాజీ డైరెక్టర్ బొక్క ప్రభాకర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బోడుప్పల్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు.

పాఠశాలల్లో గీతా జయంతి

కొడంగల్/కొడంగల్ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనేతాజీ, ఇండస్ వ్యాలీ పాఠశాలల్లో సోమవారం గీతా జయంతిని నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్‌లు రాజేందర్‌రెడ్డి, వంశీ మాట్లాడుతూ.. భగవద్గీతను గీతా లేదా గీతోపనిషత్తు అని కూడా అంటారని విద్యార్థులకు వివరించారు. 700 శ్లోకాలతో కూడిన సంస్కృత నిఘంటువని తెలిపారు. శ్రీ నేతాజీ విద్యాభవన్ పాఠశాలలో దూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థచారి విద్యార్థులకు భగవద్గీత నిఘంటువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వైభవంగా విగ్రహాల ఊరేగింపు

నవాబుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రామయ్యగూడ దత్తాత్రేయనగర్ కాలనీలో గల దత్తాత్రేయస్వామి ఆలయంలో సోమవారం నవగ్రహ, నాగుల విగ్రహాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఉదయం గీతా పారాయణం తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు మంత్రోచ్చరణలతో వైభవంగా నిర్వహించారు. మంగళవారం గణపతి పూజ, శ్రీదత్త సహస్రనామ యజ్ఞం, బుధవారం దేవతల అవాహనం, మంగళహారతి, మంత్రపుష్పం, గురువారం దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాలుగురోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

అమరుడు పోలీస్ కిష్టయ్యకు నివాళి

పరిగి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ తొలి అమరుడు పోలీసు కిష్టయ్య ముదిరాజ్ 17వ వర్ధంతిని సోమవారం పరిగి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పరిగిలోని పండుగల సాయన్న విగ్రహం దగ్గర జరుపుకున్నారు. అమరుడు కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.నాగేశ్వర్, పరిగి తాలుకా గౌరవఅధ్యక్షుడు దోమ రాచంద్రయ్య, జిల్లా కార్యదర్శి డి.మాణిక్యం, ఎం.అశోక్, కృష్ణయ్య, బాబయ్య పాల్గొన్నారు.

ఏకగ్రీవ సర్పంచ్‌లకు ఎమ్మెల్యే అభినందన



ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లను అభినందిస్తున్న ఎమ్మెల్యే

యాలాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జక్కేపల్లి సర్పంచ్‌గా పెద్దింటి లాలప్ప, సంగెంఖుర్దు సర్పంచ్‌గా సంగెం సుధాలక్ష్మి, కిష్టాపూర్ సర్పంచ్‌గా పల్లె స్వప్న మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఏకగ్రీవ సర్పంచ్‌లకు ఎమ్మెల్యే సన్మానించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.